క్లుప్తంగా

ఛత్రపతి శివాజీ ధర్మాన్ని కాపాడారు



ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవంలో పాల్గొన్న సమితి సభ్యులు

బోట్‌క్లబ్: ఛత్రపతి శివాజీ మహరాజ్ మన దేశాన్ని, మన ధర్మాన్ని కాపాడారని ఛత్రపతి శివాజీ మహరాజ్ స్ఫూర్తి సమితి అధ్యక్షులు గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ అన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని ఓటీటివారి వీధిలో బుధవారం సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. సువిశాల హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. అనంతరం భరతమాత పూజ నిర్వహించారు. కార్యక్రమంలో మద్దూరి శ్రీరామచంద్రమూర్తి, భానోజీరావు, కంచుమర్తి అప్పాజీ, కృష్ణవాణి, పెండెం శ్రీదేవి, అచ్యుతరామారావు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



రమణయ్యపేటలో నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు ప్రసూన మాట్లాడుతూ ఎలాంటి ప్రతిఫలం లేకుండా పరులకు సహాయపడడంలో ఆనందం, తృప్తి ఉంటాయన్నారు. తమ క్లబ్ సభ్యురాలు రాణి ఆర్థిక సహకారంతో నిత్యావసర సరకులు అందించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి విజయలక్ష్మి, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

అలిపిరి నుంచి తిరుమలకు ఫెన్సింగ్ పనులు చేపట్టాలి

బోట్‌క్లబ్: తిరుమల కొండకు వెళ్లే అలిపిరి మెట్ల మార్గంలో ఫెన్సింగ్ ఏర్పాటు పనులు చేపట్టాలని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు కోరారు. ఈ మేరకు ఆయన టీటీడీ ఆలయ ఈఓ జె.శ్యామలరావుకు బుధవారం రిజిస్టర్డ్ లేఖ రాశారు. స్వస్థలాల నుంచి కాలినడకన ఏడుకొండల మార్గంలో తిరుమలకు రావాలని కోరిక ఉన్నా వీలు కుదరని భక్తులు కాలినడకన అలిపిరి మెట్ల మార్గం నుంచి శ్రీవారి సన్నిధికి చేరుకునే అవకాశం ఉండేదన్నారు. అడవి జంతువుల కారణంగా గతేడాది నుంచి కాలినడక భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. వన్య మృగాల సంచారానికి ఆటంకం లేకుండా కాలినడక మార్గాల్లో షెల్టర్లకు రెండు వైపులా ఫెన్సింగ్, సీసీ కెమెరాలు, మైక్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కాలినడక మార్గంతోనే శ్రీవారి పాదాలు దర్శించి చేరుకునే భక్తుల సంఖ్య తగ్గకుండా చర్యలు చేపట్టాలని లేఖలో కోరారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లొచ్చు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టరు బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యుడు వి.జనర్దనరావు, ఆర్థిక సభ్యుడు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యుడు డాక్టరు ఆర్.సురేంద్ర హాజరవుతారని సీజీఆర్ఎఫ్ కార్యదర్శి తెలియజేశారు.

డంపింగ్‌యార్డు సందర్శించిన ఎమ్మెల్యే వనమాడి



డంపింగ్ యార్డులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు

కాకినాడ: కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) బుధవారం సంజయ్ నగర్‌లోని డంపింగ్‌యార్డు ప్రాంతాన్ని సందర్శించారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యే వనమాడి డంపింగ్‌యార్డు పరిసర ప్రాంతాల్లోని సమస్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్‌యార్డు నుంచి పాత పోర్టు రైల్వే స్టేషన్ వరకూ రహదారిని పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం కమిషనర్ జె.వెంకటరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు సూచన మేరకు పాత రైల్వే స్టేషన్ వరకూ ఉండే రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి బాలాజీ, గదుల సాయిబాబా, సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు.



పెద్దాపురప్పాడు వద్ద రాజు డ్రెయిన్‌లో గుర్రపుడెక్క



జి.భావారం డ్రెయిన్‌లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క



కరప సమీపంలో డ్రెయిన్‌లో పెరిగిన తూడు, గుర్రపుడెక్క

డ్రెయిన్లు ఇలా.. సాగు ఎలా..?

- కాలువల్లో దట్టంగా పెరిగిన గుర్రపు డెక్క, తూడు
- నీటికి అడ్డంకులను తొలగించాలని రైతుల వినతి



జెడ్.భావారం డ్రెయిన్‌ను కప్పేసిన గుర్రపు డెక్క

కరప: మురుగు కాలువల్లో పెరిగిన గుర్రపు డెక్క, తూటుకాడ రైతుల పాలిట శాపంగా పరిణమించాయి. డ్రెయిన్లలో గుర్రపు డెక్క దట్టంగా పెరిగిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గుర్రపు డెక్క తొలగించకపోతే తొలకరి సీజన్‌లో తుఫాన్లు, అధిక వర్షాలు వచ్చినపుడు ముంపునీరు లాగక పంట పొలాలు ముంపునకు గురవుతాయంటున్నారు. గత అనుభవాల దృష్ట్యా ప్రధానంగా అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చే తుఫాన్లు, అధిక వర్షాల కారణంగా నష్టం ఎక్కువగా ఉంటుందని భయపడుతున్నారు.

చిన్నపాటి వర్షమొచ్చినా ముంపే

వ్యవసాయానికి పంట కాలువలు ఎంత ముఖ్యమో, మురుగుకాలువలు కూడా అంతే ముఖ్యం. కరప మండలంలోని భూములన్నీ కాలువ శివారున, సముద్ర తీరాన ఉంటాయి. మండల పరిధిలో సుమారు 14 వేల ఎకరాలు సాగు చేస్తారు. కరప మండలానికి పైనుంచి ఐదారు మండలాల్లోని ముంపు నీరు వచ్చి మురుగుకాలువల ద్వారా సముద్రంలో కలుస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చినా పంట పొలాలు ముంపునకు గురవుతాయి. పైగా ఎగువ మండలాల నుంచి నీరు వచ్చి చేరడం వల్ల రెండోసారి ముంపు తప్పదు. సాధారణంగా మిగిలిన మండలాల్లో నాలుగైదు రోజుల్లో ముంపు నీరు లాగితే మండల పరిధిలో పంట పొలాలు వారం పదిరోజులకు గాని ముంపు నుంచి బయట పడవని రైతులు చెబుతున్నారు. మురుగు కాలువలు అధ్వానంగా తయారైనా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్‌పై ఆశలు వదులుకోవాల్సిందేనా?

మురుగుకాలువల్లో గుర్రపుడెక్క తొలగించకపోతే ఖరీఫ్ పంటపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానంగా జెడ్.భావారం, శహపురం, కూరాడ, పాతర్లగడ్డ డ్రెయిన్, వెంకటప్పయ్య డ్రెయిన్లు, రాజుడ్రెయిన్, జి.భావారం, వేళంగి డ్రెయిన్లు ఉన్నాయి. ఈ డ్రెయిన్లు అన్నీ గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రెయిన్‌లోకి చేరి అక్కడ నుంచి పటవల వద్ద సముద్రంలో కలుస్తాయి. మరి కొన్ని డ్రెయిన్లు చొల్లంగి వద్ద సముద్రంలో కలుస్తాయి. రబీ సీజన్‌లో గుర్రపుడెక్క తొలగించినా మళ్లీ అన్ని డ్రెయిన్లలో గుర్రపు డెక్క, తూటుకాడ కమ్మేశాయి. గుర్రపుడెక్కను తొలగించకపోతే పొలాల్లోని మురికినీరు, ముంపునీరు లాగదని రైతులు అంటున్నారు. వారం, పదిరోజుల్లో వర్షాలు పడితే నారుమళ్లు ముంపునకు గురవుతాయని చెబుతున్నారు. డ్రెయిన్లలో పెరిగిన గుర్రపుడెక్క, తూటుకాడను తొలగించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆమోదం రాగానే పనులు ప్రారంభిస్తాం

మండల పరిధిలోని డ్రెయిన్లలో పెరిగిన గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఏడాది జనవరిలోనే రూ.43 లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. మంజూరు ఉత్తర్వులు వచ్చిన వెంటనే షార్ట్ టెండర్లు పిలిచి గుర్రపుడెక్క తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– కె.కీర్తి, ఏఈఈ, డ్రెయినేజీ శాఖ, కరప మండలం

ముంపు తప్పేట్టు లేదు



మురుగుకాలువల్లో గుర్రపుడెక్క, తూటుకాడ అడవిలా పెరిగిపోయింది. తుపాన్లు వచ్చినా, అధికవర్షాలు పడినా నీరు లాగకపోతే తొలకరి సీజన్‌లో పంట పొలాలు మునిగిపోతాయి. పెరిగిన గుర్రపు డెక్క తొలగించకపోతే ముంపు తప్పేట్టులేదు. అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– నున్న వెంకటేశ్వరరావు, రైతు, విజయరాయుడుపాలెం

గుర్రపు డెక్క తొలగించాలి



మురుగుకాలువల్లో నీరు లాగక గతేడాది తొలకరి సీజన్‌లో వరి కుప్పలు, ధాన్యం రాశులు ముంపునకు గురయ్యాయి. డ్రెయిన్లలో తూటుకాడ, గుర్రపుడెక్క దట్టంగా పెరిగిపోయింది. గుర్రపు డెక్క తొలగించకపోతే వర్షపు నీరు లాగక సార్వా పంట మునిగిపోయి నష్టపోతాం. డ్రెయిన్లలో పెరిగిన తూటుకాడ, గుర్రపుడెక్క తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి.

– వెలుగుబంట్ల రవినాయుడు, రైతు, కూరాడ

పంట కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



పెనుగుదురు వద్ద కేఎంజే కెనాల్‌లో పొక్లెయిన్‌తో తొలగిస్తున్న గుర్రపుడెక్క

కరప: మండల పరిధిలోని కేఎంజే పంట కాలువలో గుర్రపుడెక్క, చెత్త చెదారం పెరిగిపోయింది. దీంతో పెనుగుదురు, పాతర్లగడ్డ, గొర్రిపూడి గ్రామాలకు సాగు నీరందక నారుమళ్లు పోసుకోవడానికి ఆలస్యమవుతోంది. రైతులు తమ బాధలను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీకి వివరించి సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే నానాజీ స్పందించి నిధుల మంజూరు కోసం చూడకుండా పొక్లెయిన్‌తో పంట కాలువలో గుర్రపుడెక్క తొలగించాలని జనసేన నాయకులను ఆదేశించడంతో బుధవారం పనులు చేపట్టారు.

22న స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): జిల్లా స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న స్విమ్మింగ్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు సంఘ కార్యదర్శి ఐ.రాజు బుధవారం తెలిపారు. పెద్దాపురం శ్రీప్రకాష్ స్కూల్‌లో జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు జులై 13, 14 తేదీల్లో కర్నూలు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల వారు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 92466 90466 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం

- పోలీసు అధికారులతో కమిషనర్ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: నగరపాలక సంస్థ, పోలీస్, విద్యుత్ శాఖల సమన్వయంతో ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. బుధవారం ఆయన డీఎస్పీ హనుమంతరావు, ఎస్ఈ పి.సత్యకుమారి ఆయా విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మూడు శాఖలు కలిసి సమన్వయంతో చేపట్టాల్సిన పలు అంశాలపై చర్చించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో రహదారులపై ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, 20 ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు ఆవశ్యకత, విద్యుత్ వైర్లకు అవరోధంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం వంటి అంశాలపై చర్చించారు. ఆయా విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు ఇటువంటి సమస్యలను సత్వరమే పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడొచ్చన్నారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ట్రాఫిక్ సీఐలు చైతన్యకృష్ణ, ఎస్.రమేష్, టూటౌన్ సీఐ నాగేశ్వర్‌నాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ హోంకు హాట్ బాక్సుల వితరణ



రెయిన్‌బో చిల్డ్రన్ హోంకు హాట్ బాక్సులు అందిస్తున్న హరీష్

బోట్‌క్లబ్: సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ సతీష్‌బాబు జన్మదినం సందర్భంగా రెయిన్‌బో చిల్డ్రన్ హోంకు హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరీష్ బుధవారం హాట్ బాక్స్‌లను బహూకరించారు. చిల్డ్రన్స్ హోం అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర మాట్లాడుతూ సానా సతీష్‌బాబు, హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వీరబాబు, పెనిశెట్టి సురేష్, పెదకా శేషు రాజేష్, హాస్టల్ చిన్నారులు పాల్గొన్నారు.

మెరుగైన పారిశుధ్య సేవలే లక్ష్యం

- నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు
- పారిశుధ్య పనుల తనిఖీ, ముగ్గురికి షోకాజ్ నోటీసులు



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ జె.వెంకటరావు

కాకినాడ: ప్రజారోగ్య పరిరక్షణలో కీలకమైన పారిశుధ్య విభాగాన్ని పూర్తిగా గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మెరుగైన పారిశుధ్య సేవలే లక్ష్యమని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. బుధవారం ఆయన గాంధీనగర్ రైతుబజార్, వెంకట్‌నగర్, సిద్ధార్థ నగర్, శంతనపురికాలనీ, కొత్తపేట మార్కెట్, కొత్త కాకినాడ ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు ప్రాంతాల్లోని కమ్యూనిటీ టాయ్‌లెట్స్‌ను సందర్శించి అక్కడ అందుతున్న సేవలను ఆరా తీశారు. కొన్నిచోట్ల కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్వహణలో లోపాలను గుర్తించి అవసరమైన సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కొన్నిచోట్ల లోపాలను గుర్తించి సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు బాధ్యులైన ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు శానిటరీ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకటరావు మాట్లాడుతూ పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. అదే సమయంలో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్వహణ విషయంలో స్థానికులు తగిన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్యాధికారి డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, శానిటరీ సెక్రటరీలు పాల్గొన్నారు.

పార్కును అభివృద్ధి చేయాలని వినతి



పార్కు అభివృద్ధిపై కమిషనర్‌తో మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పిఠాపురం: పట్టణంలోని ఉప్పాడ సెంటర్లో ఉన్న పురాతన చిన్నమాంబ పార్కును అభివృద్ధి చేయాలని పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. పిఠాపురం వాకర్స్ క్లబ్ సభ్యులు పార్కు బుధవారం చిన్నమాంబ పార్కులో మున్సిపల్ కమిషనర్ కనకారావును కలశారు. పార్కు అభివృద్ధిపై ఆయనకు పలు సూచనలు చేశారు. ఎన్నో ఏళ్లుగా పట్టణంతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు సేదదీరడానికి వసతి సౌకర్యాలతో పార్కు ఉండేదన్నారు. కాలక్రమేణా ఆక్రమణలకు గురై పార్కు అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. దీంతో కనీసం కూర్చోడానికి కూడా స్థలం లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎంతో చరిత్ర కలిగిన పార్కును అభివృద్ధి చేసి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

యోగా దినోత్సవానికి ఏర్పాట్లు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటి): ఈ నెల 21వ తేదీన విద్యాశాఖ, డీఎస్ఏ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ బుధవారం తెలిపారు. యోగా దినోత్సవ నిర్వహణపై డీఎస్ఏ కార్యాలయంలో డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీఈఓ పి.రమేష్, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసరావు, మెడికల్ అధికారి ఆయుష్ శాఖ డాక్టర్ పి.అరుణ జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ స్థానిక వివేకానంద పార్కు ఆవరణలోని వైఎస్సార్ స్కేటింగ్ రింక్‌లో యోగా దినోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే సత్యప్రభ



కలెక్టర్ నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ

కాకినాడ సిటీ: కాకినాడ సిటీ ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని కలెక్టర్‌ను ఆమె కోరారు. ఎమ్మెల్యే సత్యప్రభకు కలెక్టర్ నివాస్ శుభాకాంక్షలు తెలిపారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి



పిల్లలను బడికి పంపాలని తల్లిదండ్రులను చైతన్యపరుస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

కరప: తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి వారికి బంగారు భవిష్యత్ ఇవ్వాలని, బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓలు కె.బుల్లికృష్ణవేణి, పి.సత్యనారాయణ పేర్కొన్నారు. కరప శివారు పేపకాయలపాలెంలో బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బడి ఈడు గల పిల్లలను, బడిమానేసిన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపరిచారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం పిల్లల భద్రత బడిలోనే, పిల్లల చదువు భవితకు వెలుగు అంటూ నినాదాలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వచ్చే నెల 13వ తేదీ వరకూ నేను బడికి పోతా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంఈఓలు బుల్లి కృష్ణవేణి, సత్యనారాయణలు తెలిపారు. ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము కోసం ఎదురుతెన్నులు

- వెంటనే చెల్లించాలని రైతుల డిమాండ్



వేట్లపాలెంలో వ్యవసాయశాఖ జేడీ విజయకుమార్ సమక్షంలో ధాన్యం తరలించిన రైతులు (పాత చిత్రం)

సామర్లకోట: రబీ ధాన్యం విక్రయించిన సొమ్ముల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఇటీవల ముగిసిన రబీలో అనేక మంది రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు విక్రయించారు. రెండు నెలలు గడిచినా ఇప్పటి వరకూ ధాన్యం సొమ్ములు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని రైతులు వాపోతున్నారు. రైతులు ఒక పంట ద్వారా వచ్చిన ఆదాయాన్ని మరో పంటకు పెట్టుబడిగా పెడతారు. ప్రస్తుతం ఖరీఫ్ సాగు పనులు ప్రారంభం అయ్యాయి. ఇలాంటి తరుణంలో చేతిలో సొమ్ములు లేక రైతులు తొలకరి సాగు పెట్టుబడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ జారీకి ముందు విక్రయించిన రైతుల బాపతు ధాన్యం సొమ్ము నాలుగు రోజుల్లోనే వారి బ్యాంకు ఖాతాలకు జమ అయ్యింది. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయ్యాక, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ అధికారులు రైతుల బ్యాంకు ఖాతాలో జమ కావలసిన మొత్తాలను నిలుపుదల చేశారు. ఒక్క పీబీ దేవం గ్రామంలోనే వెయ్యి క్వింటాళ్ల ధాన్యం బాపతు సొమ్ము రైతుల ఖాతాలకు జమ కావలసి ఉంది. తమకు రావలసిన ధాన్యం సొమ్మును వెంటనే చెల్లించాలని వీకే రాయపురం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు. సామర్లకోట మండలంలో 200 మంది రైతులకు చెందిన సుమారు 12 వేల క్వింటాళ్ల ధాన్యం సొమ్ము వారి ఖాతాలకు జమ కావాల్సి ఉందని సొసైటీ మాజీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు తెలిపారు. తమ ఆర్థిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం సొమ్మును వెంటనే జమ చేసేలా అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు. పెట్టుబడి సొమ్ము లేకపోవడంతో అనేక మంది రైతులు ప్రస్తుత ఖరీఫ్ దమ్ములు కూడా ప్రారంభించలేదని వరహాలబాబు తెలిపారు. దీనిపై మండల వ్యవసాయాధికారి ఐ. సత్యను 'సాక్షి' వివరణ కోరింది. ధాన్యం సొమ్ము బకాయిల విషయాన్ని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి ఇప్పటికే తీసుకువెళ్లినట్టు బదులిచ్చారు.

వైభవంగా సదస్యం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరీ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సదస్య మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కొడమంచలి కార్తీక్ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి సదస్య మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఏబీహెచ్ నుంచి పూర్తి అక్రిడిటేషన్

కాకినాడ రూరల్: నగరంలోని సర్పవరం జంక్షన్ వద్ద గల ట్రస్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్స్‌కు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) నుంచి పూర్తి అక్రిడిటేషన్ లభించినట్టు ఆస్పత్రి డైరెక్టరు డాక్టర్ రామకృష్ణ బుధవారం మీడియాకు తెలియజేశారు. అత్యున్నత ప్రమాణాలతో ఆరోగ్య సంరక్షణను అందించడంలో తమ నిబద్ధతను ప్రతిబింబించేలా ఈ మైలు రాయి ఉందని ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ కోతలపై ఆందోళన

తాళ్లరేవు: గత కొద్ది రోజులుగా విద్యుత్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ కోరంగి పంచాయతీ పెద బొడ్డు వెంకటాయపాలెం గ్రామస్తులు తాళ్లరేవు సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. వారికి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా పెదబొడ్డు వెంకటాయపాలెం మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద నాలుగు కుళాయిల సెంటర్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయకపోవడంతో విద్యుత్ సౌకర్యం లేక గ్రామస్తులు అల్లాడిపోయారన్నారు. గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేబుల్ షార్టేజ్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని, సమస్యను పరిష్కరించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.